
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

శుక్రవారం 26 జూలై 2024

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన - కలెక్టర్ కోయ శ్రీహర్ష 8లో..

కోల్‌బెల్ట్ కేంద్రంగా రూ.10 కోట్ల సైబర్ మోసం 8లో..

● అభివృద్ధి, సంక్షేమానికి సమానంగా నిధులు..

- తానిపర్తి భానుప్రసాదరావు, ఎమ్మెల్సీ



రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సమానంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం అభినందనీయం. కేవలం సంక్షేమమే గాకుండా అభివృద్ధిని కూడా సాధించేందుకు ఆయా రంగాలకు నిధుల కేటాయింపు సమంజసంగా ఉంది. విద్య రంగంలో రెసిడెన్షియల్ విద్యాలయాలన్నింటినీ ఒకే చోటికి చేర్చే విధంగా ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం శుభసూచకం. ఆరు గ్యారంటీ పథకాల అమలు దిశగా, ప్రజలు విశ్వసించేలా బడ్జెట్ ఉంది.

సంక్షేమానికి తూట్లు పొడిచే బడ్జెట్..


- కోరుకంటి చందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గతంలో తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేపట్టిన సంక్షేమానికి తూట్లు పొడిచేలా బడ్జెట్ ఉంది. అంతా అంకెల గారడి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా 420 హామీలను ఇచ్చి అందులో 10 కూడా అమలు చేయలేదు. మహిళలకు ఇస్తామన్న 2500, పింఛన్ల పెంపు లేదు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ లేదు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేశారు. ఆ పథకాలు అమలుచేసే పరిస్థితి బడ్జెట్‌లో కనబడడం లేదు. దళితబంధు లేదు, గొర్రెల సబ్సిడీ పథకం లేదు. పింఛన్లు పెంచుతామన్న ఊసు లేదు. మాటలు మాత్రమే గొప్పగా ఉన్నాయి. ఆచరణ మాత్రం గుండు సున్నా అని చెప్పవచ్చు.

తప్పుల తడక, అప్పుల బడ్జెట్..

- దుగ్యాల ప్రదీప్‌కుమార్, బీజేపీ ప్రధాన కార్యదర్శి



రాష్ట్ర బడ్జెట్ తప్పుల తడకగా, అప్పుల బడ్జెట్‌గా ఉంది. పేదల ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ కాదు. పెద్దపల్లి పార్లమెంట్ నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలను గెలిపిస్తే ప్రత్యేకించి నిధులు ఇచ్చింది లేదు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్ డిపో ఊసులేదు. ఎన్నికలప్పుడు చెప్పిన దానికి అధికారంలోకి వచ్చిన తర్వాత చేసే దానికి పొంతన లేదు. ఆరు గ్యారంటీలు అన్నారు. నిరుద్యోగ భృతి, చేయూత పింఛన్ల పెంపు, బాలికలకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మీ ద్వారా తులం బంగారం ప్రస్తావన లేదు. సంఖ్యలు తప్ప అందులో ఏమీ కనబడడం లేదు. రైతులకు కూడా పూర్తిస్థాయిలో భరోసా ఇవ్వలేక పోయారు. సన్నాలకు ఇచ్చే బోనస్‌కు ఎంత సొమ్ము కేటాయించారో ప్రకటించ లేదు. ప్రజలను మోసం చేసే బడ్జెట్ ఇది.

గ్యారంటీ పథకాలకు గ్యారంటీ లేని బడ్జెట్..

- పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే గ్యారంటీ పథకాలకు గ్యారంటీ లేని బడ్జెట్‌లా కనబడుతున్నది. ఎన్నికల సందర్భంగా ఇది చేస్తాం.. అది చేస్తాం.. అని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత హామీలను అమలు చేయడం లేదు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు మహిళలకు నెలకు 2500 లేదు. పింఛన్లు పెంచింది లేదు. రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఇచ్చింది లేదు. నిరుద్యోగుల భృతి కల్పిస్తామని చెప్పి నిధులు కేటాయించలేదు. జాబ్‌లు ఇస్తామన్న గ్యారంటీ లేదు.. అంకెల గారడీ తప్ప పేద, మధ్య తరగతి ప్రజలకు ఒరిగేదేమి లేదు.

ఇది ప్రజారంజక బడ్జెట్..

- సీహెచ్ విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉంది. రైతులకు పెద్దపీట వేసి రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు చాటి చెబుతున్నది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల రుణ మాఫీతో పాటు రైతుభరోసాకు, పసల్ బీమాకు నిధులు కేటాయించారు. సన్నాలు పండించే వారికి బోనస్ కూడా ఇవ్వనున్నారు. వ్యవసాయమే గాకుండా పంచాయతీరాజ్, విద్య, వైద్య, రోడ్లు, భవనాలు, పట్టణాభివృద్ధికి సైతం నిదులు కేటాయించడం గమనార్హం. ఆరు గ్యారంటీ పథకాల అమలుపై భరోసా కల్పించారు. మంచి బడ్జెట్ ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి అభినందనలు.

అన్ని వర్గాలను ఆకట్టుకునే బడ్జెట్..

- రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, రామగుండం ఎమ్మెల్యే



రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే విధంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా, కేంద్ర ప్రభుత్వం సహకరించపోయినా ధైర్యంగా ఆర్థిక మంత్రి భట్టి 2.91 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ బ్రహ్మాండంగా ఉంది. ఎన్నికల హామీలనే నెరవేర్చే విధంగా అన్ని శాఖలకు సమాంతరంగా కేటాయింపులు చేశారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి 10 వేల కోట్లు కేటాయించడం చారిత్రాత్మకం. మంచి బడ్జెట్ ప్రవేశ పెట్టిన సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు తెలుపుచున్నాను.



వ్యవసాయానికి పెద్దపీట

- అమలవుతున్న గ్యారంటీలకు అభయహస్తం
- పింఛన్ల పెంపుపై స్పష్టత లేదు
- రాష్ట్ర బడ్జెట్‌పై నేతల భిన్నాభిప్రాయాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్ద పీట వేశారు. మొత్తం బడ్జెట్‌లో నాల్గవ వంతు బడ్జెట్‌ను వ్యవసాయ రంగానికే కేటాయించి రైతులపై తమకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా అమల్లోకి తీసుకవచ్చిన పలు పథకాలను కొనసాగించేందుకు వీలుగా నిధులను కేటాయించారు. అయితే చేయూత పథకం ద్వారా పెంచాల్సిన పింఛన్లకు సంబంధించి ప్రత్యేకించి కేటాయింపులు లేకపోవడంతో ఈ ఏడాది ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెరగడం కష్టమేనని తెలుస్తున్నది. అలాగే విద్య, వైద్య, నీటి పారుదల రంగానికి కూడా కేటాయింపులు బాగానే చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన దళితబంధు, సబ్సిడీ గొర్రెల పథకాలకు నిధుల కేటాయింపు లేకపోవడంతో, ఆ పథకాలకు ఇక మంగళం పాడినట్లేనని కనబడుతున్నది. గత ప్రభుత్వ హయాంలో అమలైన కొన్ని పథకాలు మినహా ఇతర పథకాలను క్రమంగా రద్దు జాబితాల్లో చేర్చుకుంటు పోతున్నారు. గురువారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2,91,159 కోట్ల రూపాయలతో రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. శాసన మండలిలో జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

● వ్యవసాయానికి పెద్ద పీట...

వ్యవసాయ రంగానికి 72,659 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు 2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామన్న మేరకు రుణ మాఫీ పథకాన్ని అమల్లోకి తీసుకవచ్చారు. ఆ పథకాన్ని 31వేల కోట్ల రూపాయలు కేటాయించారు. రైతుభరోసా కింద రెండు సీజన్లకు కలిపి 15 వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని ఇస్తామని ప్రకటించారు. రైతు కూలీలకు సైతం 12 వేల రూపాయలు ఇచ్చే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ఇప్పటివరకు నిలిచిపోయిన ప్రధాని ఫసల్ బీమా యోజన పథకాన్ని పునరుద్ధరించనున్నామని, రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించనున్నదని మంత్రి ప్రకటించారు. 33 రకాల సన్నాలు పండించే వరి పంటకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించారు. రాష్ట్ర బడ్జెట్‌పై వివిధ పార్టీలకు చెందిన నాయకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..

● గ్యారంటీ పథకాలకు నిధులు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీ పథ కాల్లో భాగంగా అమలుచేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సరిపడా నిధులు కేటాయించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు అమలుచేస్తున్న గృహజ్యోతి పథకానికి 2,418 కోట్లు, 500 రూపాయలకు సబ్సిడీ గ్యాస్ పథకానికి 723 కోట్లు కేటా యించారు. వైద్య శాఖకు 11,468 కోట్లు, విద్య శాఖకు 21,292 కోట్లు, నీటి పారుదల శాఖకు 22,301 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి 33,124 కోట్లు, గిరిజనుల సంక్షేమానికి 17,056 కోట్లు కేటాయించారు. బీసీలకు మాత్రం కేవలం 9,200 కోట్లు మాత్రమే తక్కువ మొత్తంలో కేటాయిం చడంతో ఆ వర్గాలు అసంతృప్తికి గురవుతున్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ధరణి రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్, జూలై 25 : మండలంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులనను ప్రణాళిక ప్రకారంగా పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో అవసరమైన విచారణ చేపట్టి పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డీఎస్సీ పరీక్షకు 467 మంది అభ్యర్థుల హాజరు

పెద్దపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న డీఎస్సీ నియామకాల పరీక్షకు గురువారం 549 మందికి 467 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సెంటినరీ కాలనీ జేఎన్‌టీయూ కళాశాలలో 200 మందికి 169 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 169 మంది అభ్యర్థులకు 141 మంది హాజరయ్యారు. పెద్దపల్లి ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 180 మంది అభ్యర్థులకు 157 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యా శాఖాధికారి మాధవి తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లికి పెరుగుతున్న వరద

- 14 టీఎంసీలకు చేరుకున్న నీటి మట్టం

పెద్దపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పెరుగుతున్నది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు కడెం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీళ్లు రావడంతో రోజురోజుకు నీటి మట్టాలు పెరుగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, గురువారం సాయంత్రం 6గంటల వరకు 14.493 టీఎంసీలకు నీటి మట్టం చేరుకున్నది. ప్రస్తుతం 20,998 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నాలుగైదు రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునే అవకాశాలున్నాయి. జిల్లాలో గురువారం ఉదయం 8గంటల వరకు 17.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కమాన్‌పూర్ మండలంలో 22.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మంథని మండలంలో 21.9మిల్లీమీటర్లు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 20.6మిల్లీమీటర్లు, పెద్దపల్లి మండలంలో 20.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ముత్తారం మండలంలో 18.2 మిల్లీ మీటర్లు, రామగిరి మండలంలో 18.2 మిల్లీ మీటర్లు, రామగుండం మండలంలో 17.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఎలిగేడు మండలంలో 16.5 మిల్లీ మీటర్లు, ఓదెల మండలంలో 16.4 మిల్లీ మీటర్లు, సుల్తానాబాద్ మండలంలో 16.3 మిల్లీ మీటర్లు, పాలకుర్తి మండలంలో 15.9 మిల్లీ మీటర్లు, అంతర్గాం మండలంలో 15.5 మిల్లీ మీటర్లు, ధర్మారం మండలంలో 13.7 మిల్లీ మీటర్లు, జూలపల్లి మండలంలో 13.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షాలతో పత్తి చేన్లు, వరి నాట్లు వేసిన పంట పొలాలు నీట మునిగాయి.

గోదావరిఖనిలో ఎడతెరిపి లేని వర్షం



గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం

కళ్యాణ్‌నగర్, జూలై 25: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయం నుంచి ఒక మోస్తరు వర్షం కురియడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేదు. బుధవారం 8.30 గంటల నుంచి గురువారం 8.30 గంటల వరకు 16మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. గురువారం ఉదయం నుంచి 9మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గత వారం రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో కార్పొరేషన్‌లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీళ్లు చొచ్చుకువచ్చాయి. భూగర్భ డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మార్కెట్‌లో కూడా జనాలు లేక వ్యాపారాలు కుంటుపడ్డాయి. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలి : ఆర్డీవో గంగయ్య



రంగాపూర్‌లో అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

పెద్దపల్లి రూరల్, జూలై 25 : వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలో నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు చేపట్టాలని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి గంగయ్య అన్నారు. గురువారం మండలంలోని రంగపూర్ నుంచి సబ్బితం ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను ఆర్డీవో పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్, ఏపీవో రమేష్‌బాబు, టెక్నికల్ అసిస్టెంట్ దివ్య, వెంకటేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో రీజియన్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు



తొలి మ్యాచ్‌లో తలపడుతున్న విద్యార్థులు

జ్యోతినగర్, జూలై 25 : రామగుండం ఎన్టీపీసీలో కేంద్రీయ విద్యాలయం హైదరాబాద్ రీజియన్ స్థాయి స్పోర్ట్స్ మీట్(బ్యాడ్మింటన్) గురువారం ప్రారంభమైంది. కేంద్రీయ విద్యాలయ సంఘటన్(హైదరాబాద్) ఆధ్వర్యంలో ఎన్టీపీసీ జ్యోతిక(రిక్రియేషన్ క్లబ్) ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ పోటీలను ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ కేదార్ రంజన్ మాట్లాడుతూ క్రీడల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని పేర్కొన్నారు. శారీరక దారుడ్యంతో పాటు మానసిక దారుడ్యం పెంపొందుతుందన్నారు. ఆటలలో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఈ పోటీలలో హైదరాబాద్ రీజియన్‌లోని వివిధ కేంద్రీయ విద్యాలయాలకు చెందిన 39 మంది బాల బాలికలు పాల్గొంటున్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రీజినల్ పోటీలకు ఎంపిక చేస్తారు. ప్రారంభ కార్యక్రమంలో కేవీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం స్పోర్ట్స్ మీట్ ముగియనున్నది. ఈ క్రీడల ప్రారంభ కార్యక్రమంలో ఎన్టీపీసీ కేంద్రీయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శోభన్ బాబు, పీడీ పూజా బిజిరానియా, కోచ్ క్రిష్ణయ్య, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా భవాని వేడుకలు



బామ్లానాయక్ తండాలో శీత్లా భవాని వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

పాలకుర్తి, జూలై 25:మండలంలోని బామ్లానాయక్ తండా, రాజీవ్‌తండాల్లో గురువారం శీత్లాభవాని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శీత్లా అమ్మవార్లకు గిరిజన మహిళలు ప్రత్యేకంగా వండిన పులగం, ఎండుమిరపకాయలు, గడ్డలు, జొన్న గుగ్గిళ్లను అమ్మవారికి చెల్లించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి తమ పాడి,పంట పొలాలు బాగా పండి తమ ఇంట సిరులు కురియాలని అమ్మవారికి పూజలు చేశారు. మాజీ సర్పంచ్ రాజునాయక్ దంపతులు, మధు, ఫూల్ చందు, చందునాయక్, భోజ్యా నాయక్, మాజీ ఉపసర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్,కారోబార్ ఇస్లావత్ సమ్మయ్య, జగన్, రాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 25: కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. కరీంనగర్ లోని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘ భవనంలో సీపీఐ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు చెక్ పెట్టడంతో ఎన్డీఏ మిత్రపక్షాలు మోదీకి చెక్ పెట్టాయన్నారు. ఎన్డీఏ పక్షాలైన ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. 44 కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను గమనించిన ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిం దన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఈ దేశంలో అంతర్భాగమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేశారన్నార ని విమర్శించారు. భూ సమస్యలు పరిష్కరించలేదని, ప్రజలు కేసీఆర్ వైఖరిపై విసిగివేసారి గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినప్పుడే ప్రజా విశ్వాసం పొందుతారన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు తక్షణమే అందించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ ఇవ్వాలన్నారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులను సవరించి రైతుల భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. భారత కమ్యునిస్టు పార్టీ సీపీఐ అవిర్భవించి డిసెంబరు 25 నాటికి 100 సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్రలో నిరంతరం, కార్మికులు, కర్షకులు, ప్రజల సమస్యల పరిష్కారమే ఏజెండగా ముందుకు సాగుతోందన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రజా సంఘాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసుకోవడానికి రాజకీయ శిక్షణ శిబిరాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్, పొనగంటి కేదారి, గడిపె మల్లేష్, గోషిక మోహన్, కసిరెడ్డి మణికంఠరెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేష్‌నగర్, జూలై 25: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం పరీక్షల నియంత్ర అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

చొప్పదండి, జూలై 25: చొప్పదండిలోని సంతోష్‌నగర్‌లో ఓవివాహిత ఇంట్లో ఉరి వేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ అనూష కథనం మేరకు.. రాచకొండ మమత వివాహం 2019లో లక్ష్మణ్‌తో జరిగింది. పిల్లలు పుట్టడం లేదని దంపతుల మధ్య సంవత్సరం నుంచి గొడవలు జరుగుతున్నాయి. మమతను లక్ష్మణ్ వేధిస్తున్నాడని ఈనెల 8న తల్లిదండ్రులు మమతను పుట్టింటికి తీసుకుపోయారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని మమత ఆత్మహత్య చేసుకున్నట్టు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జగిత్యాలలో మూడిళ్లలో చోరీ

జగిత్యాల టౌన్, జూలై 25: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో గురువారం తెల్లవారుజామున మూడు ఇళ్లలో చోరీ జరిగింది. గోవిందుపల్లి ప్రాంతానికి చెందిన ఎదురుగట్ల సతీష్‌తోపాటు మరో ఇద్దరి ఇళ్లల్లోకి దొంగలు చొరబడి ఇంటి, బీరువా తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. 15 తులాల బంగారంతోపాటు నాలు గు లక్షల రూపాయలు దోచుకెళ్లారు. నిందితులు తమ ఆనవాళ్లు దొరకకుండా సీసీ కెమెరాలు, రూటర్లను ధ్వంసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేశారు.

డిగ్రీలో ప్రవేశానికి దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్

గణేష్‌నగర్, జూలై 25: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దోస్త్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రకటించారని దోస్త్ కో ఆర్డినేటర్ సూరేపల్లి సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందని విద్యార్థులు ప్రత్యేక కౌన్సెలింగ్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 2 వరకు రిజిస్ట్రేషన్, 27 నుంచి ఆగస్టు 3 వరకు వెబ్ ఆప్షన్స్, ఆగస్టు 6న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఆగస్టు 9లోగా రిపోర్టు చేయా లన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు దోస్త్ షెడ్యూ ల్ ప్రకారం ఈనెల 15 నుంచి ప్రారంభించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జ్యోతినగర్, జూలై 25: ఎన్టీపీసీ సుభాష్‌నగర్ సమీప రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. రామగుండం వైపు నుంచి వస్తున్న ఆటో రోడ్డుపై ఉన్న గేదెను ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న బాదావత్ శేఖర్(35) తీవ్రంగా గాయపడ్డాడు. శేఖర్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుం డగా మార్గమధ్యలో చనిపోయాడు. రామగుండం ఎన్టీ కాలనీలో శేఖర్ నివాసం ఉంటున్నాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● కరీంనగర్‌లో వ్యాపారి..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్‌కు చెందిన వ్యాపారి తాటికొండ రమేష్ (49) మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. రమేష్ చొప్పదండిలో బుక్‌స్టాల్ నడుపుతూ కరీంనగర్ నుంచి రోజు చొప్పదండికి వెళ్లి రాత్రి తిరిగి కరీంనగర్‌కు వస్తుంటాడు. ఇదే క్రమంలో బుధవారం రాత్రి బుక్‌స్టాల్ మూసివేసి తన కారులో బయలుదేరిన రమేష్ నగునూర్‌లోని ఎస్ఆర్ స్కూల్ వద్దకు రాగానే రోడ్డుపై పార్క్ చేసిన లారీని వెనక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రమేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేయాలి'

కరీంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయాలని మాజీ ఎంపీ బోయినప ల్లి వినోద్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని ఒక ప్రకటనలో కోరారు. నీట్ ఎంట్రెన్స్ పరీక్ష మాత్రమేనన్నారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాలు నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు వారి శాసనసభల్లో తీర్మానాలు చేశాయని తెలిపారు. నీట్‌తో లాభం కంటే నష్టం ఎక్కువగా ఉందన్నారు. తెలంగాణలో పీజీ సీట్లు ఎక్కువ ఉన్నాయని, నీట్ ద్వారా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా లక్ష ఎంబీబీఎస్ సీట్లు ఉంటే అందులో దాదాపు 10 శాతం 8,265 మంది విద్యార్థులు తెలంగాణ లోనే ఉన్నారని చెప్పారు. నీట్‌పై అపనమ్మకం ఏర్పడిందని అన్నారు.

చింతన

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.



ముక్తి సాధన కోసం... గకార చతుష్టయం

చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధి



స్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువ స్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.



అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వివిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యథాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే.. వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనను మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013

భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

"ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.


'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.

"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.



"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.

ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా సమసిపోయాయి.


శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే... దానిలోంచి దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా... పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqlkl లో చదవండి.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్ష వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహార్యశ్రేణికిం దెల్పెనో... అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది, జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సీన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్యూటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆర్యోగానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ ఛైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్ సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

- వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు.

ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్టు రాజు వెల్లడించారు.

ఎస్సారెస్పీ కాలువలో సిల్ట్ తొలగింపు

రామగిరి, జూలై 25: మండలంలోని బేగంపేట్ గ్రామంలోని ఎస్ఆర్ఎస్పీ డి-83 కెనాల్‌లో పేరుకుపోయిన సిల్ట్‌ను గురువారం తొలగింపు పనులు చేపట్టారు. కొంత కాలంగా కెనాల్‌లో పేరుపోయిన సిల్ట్ విషయాన్ని మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు సిల్ట్ తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. సిల్ట్ తొలగింపునకు సహకరించిన ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు తిరుపతియాదవ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జూలపల్లి, జూలై 25 : మండలంలోని పెద్దాపూర్‌లో గల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో 6 నుంచి పదవ తరగతి వరకు గంటల ప్రాతిపదికన హిందీ సబ్జెక్టును బోధించేందుకు అనుభవం గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ అర్హత కలిగి ఉండి హెచ్‌పీటీ, టీఈటీ చేసి ఉండాలని, కనీస అనుభవం రెండు సంవత్సరాలు ఉండాలన్నారు. ఈనెల 31న బుధవారం నిర్వహించే ఇంటర్వ్యూకు అన్ని సర్టిఫికెట్లతో ఆసక్తిగల అభ్యర్థులు హాజరుకావాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి, జూలై 25: మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దాడి శివ(18) బుధవారం రాత్రి ఐవోసీ పెట్రోల్ పంపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ హరి గురువారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు. ప్రమాదానికిగల కారణాలను తెలుసుకొని మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్

సుల్తానాబాద్, జూలై 25: సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాల కోసం ఈనెల 27న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ మీడియట్ మొదటిసంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు సంబంధించి ఈ స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజియన్ల పరిధిలోని బాలురకు సుల్తానాబాద్ పట్టణంలోని గురుకుల విద్యాలయంలో ఈ నెల 27న ఉదయం తొమ్మిది గంటల నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి అర్హత కలిగి ఉన్న వారు ఈ నెల 27న ఉదయం 9 గంటల ప్రాంతం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సుల్తానాబాద్ శాస్త్రినగర్‌లో ఉన్న గురుకుల కళాశాలలో పాల్గొనాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షలు, గ్రామీణప్రాంతాల వారికి లక్షన్నర రూపాయలు కలిగి ఉండాలన్నారు. ఈ అర్హత కలిగిన బాలురు మాత్రమే ఈ ఇంటర్వ్యూలకు హాజరై ప్రవేశం పొందాలన్నారు. ప్రవేశాల కోసం కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు తమ వెంట పదో తరగతి మార్కుల మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం



కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

పాలకుర్తి, జూలై 25 : కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా కన్నెపల్లి పంపు హౌస్, మేడిగడ్డ సందర్శనకు విచ్చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీల బృందానికి మార్గమధ్యలోని బసంత్‌నగర్ బస్టాప్ వద్ద కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక్ హరి అధ్యక్షతన మండల బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్. 22వ డివిజన్ కార్పొరేటర్ కౌశిక్ లత, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, నాయకులు అల్లం రాజయ్య, బత్తిని సతీష్, మదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో...

జ్యోతినగర్, జూలై 25 : ఎన్టీపీసీ పీటీఎస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు పార్టీ శ్రేణులు గురువారం రాత్రి ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డ పర్యటన నేపథ్యంలో ఎన్టీపీసీ వీజీపీ గెస్ట్‌హౌజ్(జ్యోతిభవన్)లో బస చేశారు. శుక్రవారం ఉదయం ఎన్టీపీసీ నుంచి ప్రజాప్రతినిధులు మేడిగడ్డకు బయలుదేరనున్నారు. కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు మల్లారెడ్డి, గంగుల కమాలకర్, తదితరులు ఎన్టీపీసీ గెస్ట్‌హౌజ్‌లో బస చేశారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి తదితరులు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. కాగా, మరికొంత మంది ఎమ్మెల్యేలు సింగరేణి గెస్ట్‌హౌజ్, ప్రైవేటు హోటళ్లలో బస చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన : కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష



తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

ముత్తారం, జూలై 25: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ముత్తారం మండలం ముత్తారం, లక్కారం, పోతారం గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను, పాఠశాలలోని టాయిలెట్లు, భోజనశాల, కిచెన్ ఏరియాను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులను తనిఖీ చేసి ప్రాథమిక తరగతుల విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలను కలెక్టర్ పరీక్షించారు. విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని, పిల్లలకు తప్పనిసరిగా చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ రావాలని అన్నారు. లక్కారం గ్రామంలోని పాఠశాల ప్రహరీ గోడ పాక్షికంగా దెబ్బతినడం గమనించిన కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పోతారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల గ్రౌండ్ లెవెలింగ్ చేయాలని, కాంపౌండ్‌వాల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ముత్తారం ఎంపీపీఎస్ పాఠశాల వద్ద కూలిపోయే దశలో నిరుపయోగంగా ఉన్న 3వ తరగతి గదులను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. వెంట డివిజనల్ పంచాయతీ అధికారి కే సతీష్, ముత్తారం ఎంపీడీవో జి.లలిత, మండల పంచాయతీ అధికారి బి.వేణుమాధవ్, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం వరలక్ష్మి, ఏపీఎం డి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు

ప్రభుత్వం రుణమాఫీ చేసిన అర్హులైన రైతులందరికీ వాటి ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతుల రుణాల రెన్యూవల్ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతుల రుణాల రెన్యువల్ ప్రక్రియను పరిశీలించారు. రుణమాఫీ రికార్డులను తనిఖీ చేసిన కలెక్టర్ రుణమాఫీ జరిగిన రైతులందరి రుణాలు త్వరితగతిన రెన్యూవల్ చేయాలని, రుణమాఫీ ఫలాలు రైతులకు అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి క్షేత్రస్థాయి ధ్రువీకరణ ద్వారా పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు కేటాయించి, వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ గ్రామాలలో చేపట్టాల్సిన పారిశుధ్య చర్యలు, పంచాయతీ కార్యదర్శి విధులు తదితర అంశాలపై సూచనలు జారీ చేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీ ద్వారా ప్రసవాలను నిర్వహించాలని, ప్రస్తుత నెల ప్రసవం జరిగే మహిళలను మ్యాపింగ్ చేసుకోని ఫాలోఅప్ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పీహెచ్‌సీ ద్వారా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన మందుల స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కే సతీష్, ముత్తారం తహసిల్దార్ సుమన్, సింగిల్‌విండో చైర్మన్ యాదగిరిరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సింగ్, ముత్తారం ఎంపీడీవో జి.లలిత, మండల పంచాయతీ అధికారి బి.వేణుమాధవ్, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. వరలక్ష్మి, వ్యవసాయ అధికారి శ్రీకాంత్, ప్యాక్స్ సీఈఓ ప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ అమరేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికులు

- ఎల్ఈవోకు ఐఎఫ్‌టీయూ వినతిపత్రం



ఎల్ఈవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జ్యోతినగర్, జూలై 25 : ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి లుక శంకర్ అన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికు సమస్యలు, డిమాండ్లకు సంబంధించి గురువారం యూనియన్ నాయకులు టీటీఎస్‌లోని కేంద్ర కార్మిక శాఖ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో నాలుగేళ్లుగా వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ హక్కులు లేవన్నారు. కార్మికులకు మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంతో ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పని స్థలంలో సరైన రక్షణ వ్యవస్థ లేదన్నారు. కార్మిక శాఖాధికారులు యాజమాన్యం, కాంట్రాక్టరుతో చర్చించి కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంకి, రూపేష్, శ్రీకాంత్, రాకేష్, విష్ణు, వేణు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌బెల్ట్ కేంద్రంగా రూ.10 కోట్ల సైబర్ మోసం

- స్కీముల పేరిట గాలం - మంచిర్యాలలో ప్రమోటర్లు.. ముంబైలో సూత్రధారులు.. - సీపీని ఆశ్రయించిన బాధితులు



గోదావరిఖని సైబర్ క్రైమ్ స్టేషన్‌కు వచ్చిన బాధితులు

కోల్‌సిటీ, జూలై 25: ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరస్థులు తప్పుడు యాప్‌లను తయారు చేసి కోట్లు దండుకున్నారు. ముఖ్యంగా కోల్‌బెల్ట్ కేంద్రంగా మధ్య తరగతి ప్రజల బలహీనతలను ఆసరగా చేసుకుని చైన్‌లింక్ మార్కెటింగ్ పేర సామాన్యులకు వలవేశారు. రూ.10వేలు పెడితే రోజుకు 500వస్తాయంటూ నమ్మబలికి వేల మందిని ఉచ్చులోకి దించారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి కరీంనగర్ వరకు వేల మందిని ఈ వ్యాపారంలోకి లాగారు. కనీసంగా రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ. 6లక్షల వరకు పెట్టుబడి పెట్టించి తర్వాత యాప్‌లను క్లోజ్ చేశారు. నిండా మునిగామనుకున్న బాధితులు గురువారం రామగుండం సీపీ శ్రీనివాస్‌ను ఆశ్రయించారు. సీపీ ముందు తమ గోడు వెల్లబోసుకున్నారు. జాతీయ పోర్టల్ 1930లో ఫిర్యాదులు చేయడంతో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సైబర్ క్రైమ్ స్టేషన్‌లో విచారణ ప్రారంభించారు. ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు.. సైబర్ నేరస్థులు వివిధ ప్రాంతాల్లో ఏజెంట్లను పెట్టుకున్నారు. తాము ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగించి షేర్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తామని, రోజుకు రూ.1000కి రూ.500 లాభం వస్తుందంటూ నమ్మించారు. ఆన్‌లైన్‌లో డాటా అమీర్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, బ్లూచిప్ ట్రేడింగ్ తదితర సంస్థల పేర యాప్‌లు క్రియేట్ చేసి తాము పెట్రోలియం, బంగారం, ఆయిల్ రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నామని, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ ప్రభావంతో భారీగా లాభాలు వస్తున్నాయంటూ నమ్మించారు. మంచిర్యాలకు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి వాహనాల షోరూమ్‌లు, హోటళ్లలో పని చేసే వ్యకులతో పెట్టుబడి పెట్టించాడు. ఇలా ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో పెద్ద ఎత్తున కస్టమర్లను చేర్పించారు. చైన్ లింక్ విధానంతో సామాన్యులను ఆకట్టుకున్నారు. మేలో ప్రారంభమైన ఈ స్కీమ్ మెల్లమెల్లగా వేల సంఖ్యలో మెంబర్‌షిప్‌లను చేర్చే స్థితికి వచ్చింది. గత వారం ముంబై కేంద్రంగా సందీప్ ఠండన్ అనే వ్యక్తి వారంలో తనకు రూ.7కోట్ల లాభాలు వచ్చాయని, రూ.2కోట్లు చైన్ లింక్ భాగస్వామ్యులకు పంచుతానంటూ ఆఫర్ పెట్టాడు. ఈ రెండు రోజుల్లో రూ.10వేలు డిపాజిట్ చేసినవారికి రూ.20 వేలు, లక్ష డిపాజిట్ చేసిన వారికి రూ.2లక్షలు ఇస్తామంటూ నమ్మించాడు. దీంతో ఇందులో సభ్యులుగా ఉన్న వారు రెండు రోజుల్లోనే రూ.10 కోట్ల మేర డిపాజిట్ చేశారు. సోమవారం యాప్‌ను క్లోజ్ చేశారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌ను కలిసి గోడును వెల్లబోసుకున్నారు. గోదావరిఖనిలోని కమిషనరేట్ సైబర్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు సకాలంలో రుణాలు అందించాలి

ఎలిగేడు, జూలై 25: రైతులకు పంట రుణాలను సకాలంలో అందించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ)కాంతారావు అన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా రుణమాఫీ తీరు తెన్నులను పరిశీలించారు. రుణమాఫీ వర్తించిన అర్హులైన రైతులను గుర్తించి సకాలంలో పంట రుణాలను అందించాలని ఆదేశించారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి ఉమాపతి, ఏఈవో గణేష్, సీఈవో విక్రమ్, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

మంథని, జూలై 25: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని దివ్యాంగుల నెట్ వర్క్ జిల్లా కన్వీనర్ ఇనుముల సతీష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల మాట్లాడుతూ లక్షలాది మంది దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాల్సిన ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వారు మనోధైర్యాన్ని కోల్పోయే విధంగా సోషల్ మీడియా వేదికగా మాట్లాడటం బాధాకరమన్నారు. ఐపీఎస్, ఐఎఫ్ఎస్ విభాగాల్లో దివ్యాంగులకు సైతం రిజర్వేషన్ కల్పించాలని సూచించాల్సింది పోయి వారికి రిజర్వేషన్ ఎందుకని మాట్లాడటం మమ్మల్ని ఎంతగానో బాధించిందన్నారు. స్మిత సబర్వాల్ మాటలను ఖండిస్తున్నామని, ఆమె తన మాటలను వెనక్కి తీసుకోవడంతో పాటు బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు దోర్లగొర్ల శ్రీనివాస్, కొమురోజు సురేష్, వద్లూరి ఈశ్వరచారిలు పాల్గొన్నారు.

లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

-అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవీందర్

మంథని, జూలై 25: కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వం ఇస్తున్న లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మంథని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ దుబాసి రవీందర్ తెలిపారు. ఇక్కడ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా పని చేసిన హేమలత పెద్దపల్లికి బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో దుబాసి రవీందర్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డు సేవల గురించి మధ్యవర్తులను సంప్రదించకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి సేవలు పొందుకోవాలని కోరారు. కార్మిక శాఖ అందజేసే లేబర్‌కార్డు ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్మికులు తప్పనిసరిగా లేబర్ కార్డు పొంది ఉండాలని సూచించారు.

'దళితులపై ప్రభుత్వం చిన్న చూపు'

కళ్యాణ్‌నగర్, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం బాధాకరమని దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చిలుక ప్రసాద్ ఆరోపించారు. గురువారం గోదావరిఖని చౌరస్తాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి ఎలాంటి ఉపయోగకరమైన ప్రణాళికలు లేవన్నారు. దళిత సమాజాన్ని కించపరిచే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వాలు దళితులు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో ప్రతిష్టాత్మకంగా దళిత బంధు ప్రవేశపెట్టి దళితుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు దళిత కుటుంబానికి దళిత బంధు క్రింద రూ.12లక్షలు ఇస్తామని చెప్పి ఓట్లు దండుకుని ఇప్పుడు దళితులను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను దళితులు ఏకమైన తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు రాములు, లక్ష్మి, వెంకటేష్, రామకృష్ణ, లక్ష్మి, ప్రసాద్, రమేష్, రవితేజ, రమాకాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి

సుల్తానాబాద్, జూలై 25: సుల్తానాబాద్ ప్రాంత రైస్‌మిల్లుల్లో లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి అన్నారు. లారీ డ్రైవర్లకు కనీస హక్కులు కూడా లేవని ఆయన అన్నారు. సుల్తానాబాద్ ప్రాంత రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న లారీ డ్రైవర్లతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లారీ డ్రైవర్ల కుటుంబాలు కడు దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కనీస హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం లారీడ్రైవర్ల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర స్థాయి కార్మిక నేతలు పాల్గొంటారని దీన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో లారీ డ్రైవర్లు సంఘం అధ్యక్షుడు పోగుల తిరుపతి, నాయకులు తిరుపతిరెడ్డి, మునీర్ బేగ్, మజహర్, మంజూరీ, నాషర్, వజీద్, సంతు, సంపత్, కరిణ్, రబ్బానీ, అలీ, కౌసర్, శంకర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంథని, జూలై 25: కరీంనగర్ జిల్లా రాజకీయ చరిత్రపై మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో చేపట్టిన చర్చా గోష్టిని విజయవంతం చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండెల మారుతి కోరారు. గురువారం ఆయన విలేకరుల మాట్లాడుతూ ఈనెల 28న మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిలిం భవన్‌లో ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రపై చర్చా గోష్టి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రాజకీయంగా ఎంతో చరిత్ర ఉందని, దాన్ని వెలుగు తీసేందుకే చర్చ గోష్టి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజకీయ చరిత్ర గోష్టి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంథని విద్యార్థి యువత ప్రతినిధులు రామడుగు మారుతి, ఖాజా మొహీనుద్దీన్, గాయకుడు సర్వచిన్న బాపులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

కమాన్‌పూర్, జూలై 25 : ఉచిత వైద్య శిబిరంతో పాటు పేద ప్రజలకు అండగా ఉంటూ కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవలు ప్రశంసనీయమని మంథని ఆర్డీవో హనుమనాయక్ అన్నారు. మండలంలోని జూలపల్లిలోని ఆదర్శనగర్‌లో సాన గార్డెన్‌లో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్, రేకుర్తి ఉదారత ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్, సదాశయ పౌండేషన్ సంస్థల సేవ కార్యక్రమాల వలన ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి పరీక్షకు అవసరమైన 40 మందిని బస్సు ద్వారా రేకుర్తి ఉదారత ఆసుపత్రికి తరలించారు. కంటి ఆసుపత్రి టెక్నిషియన్ చింతల ప్రభాకర్, చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిగురు సురేష్, తహసీల్దార్ అరిపోద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, ఎస్ఎంఎస్‌పీవో నూకల రమేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, సదాశయ పౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

కాల్వ శ్రీరాంపూర్, జూలై 25: మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో గూడెపు రాజు మృతి చెందగా గురువారం మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుముఖం మల్లారెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు నూనెటి కుమార్‌యాదవ్, మాజీ వార్డు సభ్యులు శంకర్, నేరెళ్ల రవి, నేరెళ్ల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

నోట్ బుక్కుల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జూలై 25: మండలంలోని ఇదిలాపూర్ గ్రామంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పీవీకేఆర్ సైన్యం అధ్యక్షుడు పులి ఇంద్రకరణ్‌రెడ్డి నోట్‌బుక్కులు, పెన్సిల్స్ అందజేశారు. ఈకార్యక్రమంలో పులి మౌనికరెడ్డి, మాజీ సర్పంచ్ తుల మనోహర్ రావు, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు పాల రాజేశం, రానవేన శ్రీనివాస్ జంపయ్య, కారుపాకల రమేష్ ఉన్నారు.



ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారికి సన్మానం



గురువయ్యను సన్మానిస్తున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, జూలై 25: కార్పొరేట్ సేఫ్టీ జీఎంగా ఉద్యోగ విరమణ పొందనున్న గురువయ్యకు గురువారం ఏఎల్‌పీ గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రీజియన్ సేఫ్టీ జీఎం కెహెచ్ఎన్ గుప్తా, అధికారులు సత్యనారాయణ, రఘురాం, జనార్దన్, తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

ఓసీపీ-1లో బ్లాస్టింగ్.. కార్మికుడికి గాయాలు

రామగిరి, జూలై 25 : సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధి ఓసీపీ-1లో కాంట్రాక్టు కార్మికుడు శ్రీకాంత్ గురువారం గాయపడ్డాడు. క్వారీలోని హోల్స్‌లో బ్లాస్టింగ్ మెటీరియల్ నింపుతుండగా మంటలు రావడంతో గాయపడ్డాడు. తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

కాసిపేట, జూలై 25: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ విఫలమైందని ఐఎన్‌టీ యూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య అన్నారు. గురువారం కాసి పేట1వగనిలో బాయి బాట కార్యక్రమంలో కార్మికులను సమస్యలు అడిగితెలుసుకున్నారు.

గనులపై 'వృక్షారోహణ్'ను ప్రారంభించిన జీఎంలు



మొక్క నాటుతున్న ఆర్జీ-2 జీఎం



మొక్క నాటుతున్న ఏపీఏ జీఎం, ఆర్డీవో

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 25: ఆర్జీ-2 ఏరియాలో వృక్షారోహణ్ కార్యక్రమాన్ని జీఎం సూర్యనారాయణ జీఎం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి ప్రారంభించారు. వృక్షారోహణ్ అభియాన్-2024 కార్యక్రమంలో భాగంగా ఏరియా పరిధిలోని గనులు, ఉద్యోగుల నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, పరిసర, ప్రభావిత ప్రాంతాల్లో మొక్కలను నాటే లక్ష్యంతో ఉచితంగా మొక్కలను పంపిణీ చేయనున్నట్లు జీఎం పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి విధిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని జీఎం కోరారు. ఉద్యోగుల కుటుంబీకులు, పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎంసేఫ్టీ గురువయ్య, ఆర్జీ రీజియన్ జీఎం సేఫ్టీ గుప్తా, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, అధికారులు మధుసూదన్, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, సురేష్‌బాబు, ధనుంజయతో పాటు వివిధ విభాగాల అధికారులు, జీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీ-3, ఏపీఏలో..

రామగిరి, జూలై 25: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలో వృక్షారోహన్ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. అందులో భాగంగా సెంటినరీకాలనీ, ఎస్‌టీపీ ప్లాంట్ సమీపంలోని నాలుగు ఎకరాల స్థలంలో వృక్షారోహన్ అభియాన్ వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ, మంథని ఆర్డీవో హనుమా నాయక్‌లు ముఖ్య అతిథిలుగా హాజరై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జీఎంలు మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా 25 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకున్నామని ఇప్పటి వరకు 7 లక్షల మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, శ్రీనివాసులు, రఘుపతి, సత్యనారాయణ, శేఖర్‌బాబు, రాజారెడ్డి, కర్ణ, చంద్రశేఖర్, రాజేందర్, రవీందర్‌రెడ్డి, రాజేశ్వరీ, ఆరిఫోద్దీన్, తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీవో శైలజారాణి, ట్రేడ్ యూనియన్ నాయకులు కోట రవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, వివిధ గనుల అధికారులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ప్రమాద బీమాపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 25: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఉచిత ప్రమాద బీమా వర్తింపుపై గురువారం స్థానిక కమ్యూనిటీహాల్‌లో అవగాహన కార్యక్రమాన్ని ఆర్జీ-2 యాజమాన్యం నిర్వహించింది. గోదావరిఖని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది తమ బ్యాంక్‌లో ఖాతా కలిగి ఉండడం వల్ల 30లక్షల ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. కాగా బీమా సదుపాయం పొందడంలో కాంట్రాక్టు కార్మికులకు ఉన్న సందేహాలను బ్యాంక్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ నివృత్తి చేశారు. కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం అభ్యర్థన మేరకు వారి సంక్షేమం కోసం ప్రమాద బీమాను ఉచితంగా అమలులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. ఖాతాద్వారా కలిగే ఇతర ప్రయోజనాలను బ్యాంక్ మేనేజర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, అధికారులు రాజేంద్రప్రసాద్, ధనుంజయ, ప్రతాపగిరిరాజు, వేణుగోపాల్, రాధాకృష్ణ, షేక్ యాకుబ్ పాష పాల్గొన్నారు.